క్లుప్తంగా

ఘనంగా శీతలాదేవి ఆలయ వార్షికోత్సవం



నరసరావుపేట రూరల్: మండలంలోని పెదరెడ్డిపాలెంలో వేంచేసియున్న శీతలాదేవి అమ్మ వారి ఆలయ 7వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపి అ లంకరించారు. ఆలయ ఆవరణలో మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భవనం వారి ఇలవేల్పు అయిన శీతలాదేవికి భవనం వర్గీయులు గ్రామంలో ఆలయం నిర్మించి ప్రతి ఏడాది వేడుకలు నిర్వహిస్తున్నారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. వేడుకలను ఆలయ కమిటీ చైర్మన్ భవనం మోగలారెడ్డి, భవనం సాంబిరెడ్డి, భవనం శివారెడ్డి, భవనం వీరారెడ్డి, భవనం కృష్ణారెడ్డి, భవనం సుధాకర రెడ్డి పర్యవేక్షించారు.

మోడల్ స్కూల్ వార్షికోత్సవం...



ఈపూరు: మండల కేంద్రంలోని ఈపూరు మోడల్ స్కూల్ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తహసీల్దార్ రమావత్ వెంకటేశ్వర్లు నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని, అప్పుడే అలాగే తల్లిదండ్రులకు మంచిపేరు రావాలంటే పిల్లలు ఉన్నతస్థాయిలో ఉన్నప్పుడే అది జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉషాకిరణ్, పీఎంసీ చైర్మన్ పున్నయ్య, వైస్ చైర్మన్ కోటేశ్వరమ్మ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, శాకమూరి బుచ్చయ్య, కాకనబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మెహర్ బాబా జయంతి



నరసరావుపేట ఈస్ట్: అవతార్ మెహర్‌బాబా 129వ జన్మదిన వేడుకలను శనివారం పాతూరులోని మెహర్‌బాబా ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం మెహర్‌బాబా మూలమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించారు. మెహర్‌బాబా చాలీసా, భజనలు, ప్రేమ సందేశం కార్యక్రమాలను భక్తులు నిర్వహించి అన్నప్రసాద వితరణగావించారు. ఆయా కార్యక్రమాలలో బాబా భక్తమండలి సభ్యులు వంకాయల అచ్యుతరావు, కోట కోటేశ్వరరావు, శ్రీవాసవీ మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, కాకుమాను సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుంటూరుకు చెందిన భక్తులు గ్రంధి నాగరాజు, సుప్రియ చిన్మయి, మెహర్ జ్ఞానేశ్వర్‌లు బాబాకు వెండి కిరీటం బహుకరించారు.

సైనిక్ స్కూల్‌కు సీబీఐటీ విద్యార్థులు



నరసరావుపేట ఈస్ట్: దేశవ్యాప్తంగా సైనిక్ స్కూల్‌లో ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశపరీక్షలో సీబీఐటీ పాఠశాలకు చెందిన 21మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ జి.కామేశ్వరి శనివారం తెలిపారు. పాఠశాల నుంచి 41మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 21మంది అర్హత సాధించటం అభినందనీయమన్నారు. పల్నాడు జిల్లాలో సైనిక్ స్కూల్‌కు అర్హత పొందిన విద్యార్థులలో అత్యధికులు తమ విద్యార్థులేనని తెలిపారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ పి.యోగి రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యక్తిపై కేసు నమోదు

నరసరావుపేట టౌన్: స్టేడియం ఆవరణలో మహిళల ఫొటోలు తీస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు శనివారం తెలిపారు. సత్తెనపల్లి రోడ్డు స్టేడియంలో ప్రతిరోజూ వందల మంది వాకింగ్ కోసం వెళ్తుంటారు. అక్కడ వారి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల వద్ద అజ్ఞాత వ్యక్తి చాటున నిలుచొని మహిళలు వచ్చిన సమయంలో ఫొటోలు తీస్తున్నాడు. ఈ మేరకు ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గ్రామ సచివాలయాలతో సుపరిపాలన

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- వేల్పూరులో కొనసాగిన గడప గడపకు కార్యక్రమం



కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

శావల్యాపురం: గ్రామసచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. శనివారం మండలంలోని వేల్పూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు ఇంటింటికీ తిరిగి నవరత్నాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన కరపత్రాలను ప్రజలకు అందజేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ ప్రజలను మోసం చేయటమే చంద్రబాబు నాయుడు, టీడీపీ వారి నైజమన్నారు. గత ఎన్నికల్లో రుణమాఫీ చేస్తామని మోసం చేసిన గెలిచిన తర్వాత ప్రజలను గాలికి వదిలివేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు.

అలాగే జన్మభూమి కమిటీల పేరుతో అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందనీయకుండా చేశారన్నారు. ప్రతిపక్ష నాయకులు గతంలో మీటింగ్‌లు పెట్టి తనసొంత గ్రామమైన వేల్పూరులో ఈ బొల్లా బ్రహ్మనాయుడు ఏమి చేశారని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎమ్మెల్యే కాక ముందు నా జన్మభూమి అభివృద్ధిలో నాశక్తి వంచన లేకుండా నాసొంత నిధులు వెచ్చించి పలు రకాల అభివృద్ధి పనులు చేశానన్నారు. జగనన్న మూడు సంవత్సరాల పాలనలో సంక్షేమ పథకాల వేల్పూరు గ్రామపంచాయతీలో ఇప్పటి వరకు రూ.46 కోట్లు 44 లక్షలు పథకాల రూపంలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో నగదు జమ చేసినట్లు చెప్పారు.

కాగా గ్రామంలో దోమ వీరాంజనేయులు రెండు కాళ్లు చచ్చుపడి నడవలేని స్థితితో ఉండటంతో పాటు వలంటీరు మేడా మల్లేశ్వరీ థైరాయిడ్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండగా ఇరువురు మెరుగైన వైద్యసేవలు అందించాలని గుంటూరు జీజీహెచ్ వైద్యాధికారితో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కార దిశగా ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు చొరవ చూపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రంతు శ్రీనివాసరావు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు, మాజీ జెడ్పీటీసీ స్వర్ణాల వెంకట్రావు, ఉప సర్పంచ్ మారాసు రామయ్య, సర్పంచులు మొనపాటి శ్రీనివాసరావు, తిరివిధి రమణారావు, తూమాటి కబ్బారావు, ముండ్రు రాఘవరావు, ముండ్రు సాంబశివరావు, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, పంచాయతీ కార్యదర్శులు కొమటి నేని అశోక్ చౌదరి, ఆళ్ళ యుగంధర్, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వైద్య ఆరోగ్య సిబ్బంది వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల వసూలు పురోగతి పెంచాలి

శావల్యాపురం: ఇంటి వసూలు పురోగతి వేగవంతం చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లోని పంచాయతీ కార్యదర్శులు, గ్రామసచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సమన్వయంతో 58 శాతం వసూలు చేశారని, మార్చి నెలఖారులోగా నూరు శాతం వసూలు చేయాలన్నారు.ఇప్పటి వరకు మండలంలో అన్నీ గ్రామపంచాయతీల్లో రూ.43 లక్షల 39 వేల 530 రూపాయాలు బకాయి ఉండగా ఇందుకుగాను రూ. 25 లక్షల 40వేల 607 రూపాయాలు అందరు సమన్వయంతో వసూలు చేశారన్నారు. మండలంలోని వయ్యకల్లు, శానంపూడి, ముండ్రువారిపాలెం, పిచికలపాలెం గ్రామపంచాయతీలో పురోగతి బాగా ఉందన్నారు. ఇంటి పన్నులు చెల్లింపుల వలన కలుగు ప్రయోజనాలు ఆయా గ్రామపంచాయతీల్లోని కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయనతో పాటు ఈవోపీఆర్‌డి పి.సుగుణ, కార్యాలయ సిబ్బంది కారుచోలు భారతి, నలబోతుల వరలక్ష్మి ఉన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు

శావల్యాపురం: గర్భిణుల్లో రక్తహీనత నివారణకు పోషకాలతో కూడిన ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్ అన్నారు. శనివారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే చేసి రక్తహీనత లోపాలతో బాధపడేవారిని గర్భిణులను గుర్తించి క్షేత్రస్థాయిలో వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో ప్రభుత్వం మంజూరు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషకాహాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రసన్నాంజనేయస్వామికి ఎమ్మెల్యే ప్రత్యేకపూజలు

ఈపూరు: మండలంలోని బొగ్గరం గ్రామంలో శ్రీ ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్లకు స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు హాజరై శుక్రవారం రాత్రి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు ఎమ్మెల్యేకు అందజేశారు. ఆయన వెంట జడ్పీటీసీ చౌడయ్య, మండల పార్టీ అధ్యక్షులు దేవరాజ్, బుచ్చయ్య, బొల్లా బుజ్జి, మందపాటి రామారావు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నరసరావుపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం పట్టణంలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పెదచెరువు ప్రాంతానికి చెందిన ఇరగదిండ్ల చిన్న సైదయ్య(50) తాపీపని చేస్తుంటాడు. ఉదయం తన తాపీపని మేస్త్రీ రహిమాన్‌తో కలిసి స్కూటీపై పనికి వెళ్తున్నాడు. ఏరియా వైద్యశాల వద్దకు వచ్చేసరికి వెనుకగా వచ్చిన మినీలారీ ఢీకొంది. సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ సైదయ్య అక్కడికక్కడే మృతి చెందగా రహిమాన్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఈ మేరకు మృతుడి భార్య మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వీరేంద్ర బాబు తెలిపారు.

హక్కులు తెలుసుకోవాలి

నరసరావుపేట టౌన్: ఖైదీలు తమ హక్కులను తెలుసుకోవాలని రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె. అంజయ్య అన్నారు. శనివారం సబ్‌జైలును సందర్శించిన ఆయన ఖైదీలనుద్దేశించి మాట్లాడారు. సమస్యలు ఏమైనా ఉంటే వ్రాసి ఫిర్యాదుల పెట్టెలో వేయాలన్నారు. మొదట సబ్‌జైల్‌లో ఖైదీలకు అందించే ఆహార నాణ్యతను పరిశీలించారు. అందుతున్న సేవలను ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సబ్‌జైలర్ రవికుమార్ యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

28న నిలిచిపోయిన లబ్ధిదారులకు నగదు జమ

శావల్యాపురం: రైతుభరోసా పథకంలో వివిధ కారణాలు వలన నగదు జమ కాని లబ్ధిదారులకు ఈనెల 28న ప్రభుత్వం నేరుగా రైతులకు బ్యాంకు ఖాతాలో నగదు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు శనివారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 11 రైతుభరోసా పరిధిలో 409 మంది రైతులకు రూ.16 లక్షల 28వేల 500 నగదు జమ చేయనున్నట్లు ఏవో చెప్పారు. ఆయనతో పాటు ఏఈవో పురేటి ఆశోక తదితరులు ఉన్నారు.

క్రీడా పోటీల్లో ఏఎంజీ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులతో ఏఎంజీ సిబ్బంది

చిలకలూరిపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించటం అభినందనీయమని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి చెప్పారు. రోటరీక్లబ్ ఆఫ్ పండరీపురం యువజనోత్సవాల్లో భాగంగా ఈ నెల 21, 22 తేదీల్లో పట్టణంలోని చౌదరయ్య స్కూల్లో నియోజకవర్గ స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఏఎంజీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొని ఖోఖో బాలికల విభాగంలో ప్రథమ బహుమతి, కబాడ్డీ బాలుర విభాగంలో ప్రథమ బహుమతితో పాటు అథ్లెటిక్స్‌లో 9 బంగారు పతకాలు, 7 రజిత పతకాలు, 5 కాంస్య పతకాలు సాధించి ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం చేసుకున్నారు. ఈ విద్యార్థులకు ఏఎంజీ ప్రాంగణంలో శనివారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ సీఏవో బి.మాశిలామణి, హైస్కూల్ హెచ్ఎం పి.మేరి, వ్యాయమ ఉపాధ్యాయుడు కె.రాజు, డి.రాజేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాటక రంగానికి పూర్వవైభవం తెస్తాం

- సుందరయ్య నాటకోత్సవ కమిటీ నిర్వాహకులు ముత్తవరపు సురేష్ బాబు
- జాతీయస్థాయి 20వ తెలుగు సాంఘిక నాటికల పోటీల వివరాలు
- మార్చి 31, ఏప్రిల్ 1, 2 తేదీల్లో యడ్లపాడులో నిర్వహణ



నాటికల పోటీల వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

యడ్లపాడు: నాటకరంగానికి పూర్వ వైభవం తెచ్చేందుకు యడ్లపాడు పుచ్చలపల్లి నాటకోత్సవ కమిటీ కృషి చేస్తుందని కమిటీ సభ్యులు ముత్తవరపు సురేషబాబు తెలిపారు. స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రంలో శనివారం కమిటీ సభ్యులు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయి 20వ తెలుగు సాంఘిక నాటికల పోటీలు ఈ ఏడాది మార్చి 31, ఏప్రిల్ 1, 2వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. శ్రీరామనవమి పండుగ మరుసటి నాడే ప్రారంభమై మూడురోజుల పాటు కళల పండగ కొనసాగుతుందన్నారు. మే 19, 20 తేదీల్లో సుందరయ్య వర్ధంతి సందర్భంగా కమిటీ ఆహ్వాన నాటికల పోటీల్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఏటా క్రమం తప్పకుండా నిర్వహించే ఈ కళాప్రదర్శనలకు కోవిడ్ రెండేళ్లు తెరపడిందన్నారు. అనంతరం గతేడాది నుంచి తిరిగి ఆహ్వాన నాటికల ప్రదర్శనలు కాకుండా జాతీయస్థాయి పోటీల నిర్వహణకు శ్రీకారం చుట్టామన్నారు. రెండు రోజులకు బదులుగా మూడు రోజులు 9 ప్రదర్శనలు ఇచ్చేలా చర్యలు తీసుకున్నామన్నారు. అయితే ప్రదర్శనకు వచ్చే తొమ్మిది కళారూపాలు జాతీయస్థాయి తెలుగు నాటికల పోటీల్లో ప్రదర్శితమై బహుమతులు సాధించినవే అన్నారు. సమాజాన్ని పట్టి పీడించే సాంఘిక రుగ్మతలపై సంధించే అస్త్రాల వంటి కళారూపాలన్నారు. ప్రతి నాటిక ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, వినూత్న సెట్స్ రూపకల్పనతో వేటికవే పోటాపోటీగా ఉంటాయన్నారు.

త్వరలోనే పోటీ నాటికలను ఎంపిక చేసి ప్రకటిస్తామన్నారు. ఇక పోటీల నిర్వహణలోనూ వైవిధ్యం ఉంటుందన్నారు. ఈ కళల పండుగకు గ్రామంలోని 10వేల గడపకు ఇంటింటికీ వెళ్లి ఆహ్వాన పత్రాలు, ప్రత్యేక కూపన్లు కమిటీ సభ్యులు అందజేయడం విశేషం అన్నారు. ప్రతిరోజు నాటిక ప్రదర్శన ముగియగానే ఆ ప్రదర్శనకు వచ్చిన ప్రేక్షకుల నుంచి వచ్చిన కూపన్లను డ్రాతీసి ముగ్గురికీ అక్కడే బహుతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. పోటీలకు న్యాయనిర్ణేతలను వ్యవహరించే విషయంలోనూ కొత్త విధానం చేపట్టామన్నారు. జర్నలిజం, కళాసంస్థ, రచన, దర్శక, నటుల్లో ప్రముఖులు ఉంటారన్నారు. వీరితో పాటు మరికొన్ని రంగాలకు చెందిన 12 మందిని ప్రజాన్యాయ నిర్ణేతలుగా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రదర్శనల్లో ఉత్తమమైన నాటికల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, ప్రతి నాటిక రచయిత, ప్రదర్శన పారితోషకం, జ్ఞాపికలు ఇవ్వనున్నట్లు చెప్పారు. మహిళా కళాకారిణీలకు ఆడపడుచు లాంఛనాలతో కానుకలిచ్చి సత్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో పుచ్చలపల్లి సుందరయ్య నాటకోత్సవ కమిటీ నిర్వాహకులు జరుగులు శంకరరావు, నూతలపాటి కాళిదాసు, ముత్తవరపు పద్మారావు పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు ఉచితంగా న్యాయ సహాయం

సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి నాగవెంకటలక్ష్మి



వృద్ధులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నాగవెంకటలక్ష్మి

సత్తెనపల్లి: అనాథ వృద్ధులకు ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి డి.నాగ వెంకటలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని ఆదరణ అనాథ వృద్ధుల ఆశ్రమాన్ని శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆశ్రమంలోని వారికి సంతానం ఉన్నారా..? వారే పంపించారా లేక.. నిరాదరణ వల్ల వచ్చారా..? అని అందరినీ అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్‌ను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు దివ్వెల శ్రీనివాసరావు, బీఎల్.లక్ష్మి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలి

సత్తెనపల్లి: స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని కాకతీయ జనసేవ సమితి అధ్యక్షుడు యెల్లినేడి రామస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని కాకతీయ కల్యాణ మండపంలో ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వైద్య సిబ్బంది సత్తెనపల్లి కాకతీయ జనసేవ సమితి ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నేత్ర వైద్యులు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆదివారం కూడా ఉచిత శిబిరం కొనసాగుతుందని తెలిపారు. సమితి కార్యదర్శి రావెల చంద్రశేఖర్, ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మక్కెన అచ్చయ్య, చల్లా రత్తయ్య, గద్దె మురహరిరావు తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపాలి



సంఘీభావం తెలుపుతున్న నాగమల్లేశ్వరరావు

యడ్లపాడు: ఉద్యోగ సంఘాల సమస్యల పరిష్కారం ప్రభుత్వం చూపాలని ఉద్యోగుల పోరుబాట–ఏపీజేఏసీ పల్నాడు చైర్మన్, యడ్లపాడు తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావు కోరారు. యడ్లపాడు టీటీడీ కల్యాణ మండపంలో శనివారం సాయంత్రం పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్‌సీల అంశాలు పరిష్కరించక పోవడంతో ఉద్యోగులు, పెన్షనర్లు, కార్మికులు మనోవేదనకు గురవుతున్నారు. ఆయా కుటుంబాలకు చెందిన వారు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొవాల్సి వస్తుందని పేర్కొన్నారు. వాటిని సత్వరమే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో యడ్లపాడు వీఆర్వో అసోషియేషన్ అధ్యక్షుడు కేపే చారి, సీనియర్ అసిస్టెంట్ సాతులూరి మోజేష్, వీఆర్వోలు సీహెచ్ రాయుడు, జే మధుసూదనరావు, ఆఫీస్ సబార్డినేట్ బి.చెంచురాజు పాల్గొన్నారు.

వైభవంగా విఘ్నేశ్వర స్వామి తిరునాళ్ల

- వేకువజాము నుంచే భక్తులు కిటకిట
- పొంగళ్లు పొంగించి మొక్కలు తీర్చుకున్న వైనం
- తరలివచ్చిన భారీ విద్యుత్ ప్రభలు



పట్టువస్త్రాలు, పుష్పాలతో అలంకరించిన మూలవిరాట్

యడ్లపాడు: కారుచోల–గుత్తావారిపాలెం గ్రామాల మధ్య పీబీసీ కాలువకట్టపై వేంచేసి ఉన్న విఘ్నేశ్వర స్వామి ఆలయ 32వ వార్షిక తిరునాళ్ల వేడుకలు శనివారం ప్రారంభం అయ్యాయి. తిరునాళ్లను పురస్కరించుకుని గుడికి కొత్తరంగులతో విద్యుత్తు కాంతులతో శోభిల్లింది. శనివారం వేకువ జాము నుంచే ఆలయ అర్చకులు జంధ్యాల మల్లికార్జునరావు ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. స్వామి వారికి 21 సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, పట్టువస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. ఉదయం నుంచి వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. గుడి వద్దనే తమ మొక్కలు తీర్చుకుని స్వామి వారికి నైవేద్యాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పలు రకాల ప్రసాదాలను వితరణ చేశారు. సాయంత్రానికి కారుచోల గ్రామం నుంచి నాలుగు, గనికపూడి గ్రామం నుంచి ఒక భారీ విద్యుత్ ప్రభలు తరలి వచ్చాయి. ఆయా ప్రభల వద్ద ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు.

కనుల పండువగా కోదండరాముడి గ్రామోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవ మూర్తులు

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలోని శంభునిపాలెంలో కొలువైయున్న కోదండరామ స్వామి దేవస్థాన 16వ వార్షికోత్సవ అష్టబంధ మహా మహా సంప్రోక్షణ వేడుకల్లో భాగంగా శనివారం కల్యాణమూర్తులకు కన్నుల పండువలా గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ పూజారి పరాంకుశం విజయ రామాచార్యులు బృందం ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల్లో ప్రత్యేక రథంపై ఊరేగించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను ఆలయం వద్దకు చేర్చి భద్రపరిచారు. ఈ నెల 21న ప్రారంభమైన వేడుకలు శనివారంతో ముగిశాయి. శాంతి హోమాలు, భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయం ముందు వేసిన చలువ పందిరిలో మహాహోమం, శాంతిహోమాలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ ధర్మకర్త నల్లమోతు పుల్లారావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఉపాధి హామీ పథకంలో పనులకు ప్రతిపాదనలు



ఉపాధి హామీ పథకం పనులను పర్యవేక్షిస్తున్న ఏపీవో

బొల్లాపల్లి: ఉపాధి హామీ పథకంలో కూలీలకు పనులు కల్పించేందుకు 219 పనులకు గాను రూ.10.07కోట్ల మేర ప్రతిపాదనలు తయారు చేసి పంపామని ఆ శాఖ ఏపీవో జీఎస్ ఆంజనేయరాజు శనివారం తెలిపారు. ప్రస్తుతం మండలంలో 18 పంచాయతీల్లో 1200 మందికి పైగా కూలీలకు పనులు కల్పించనున్నామని, చెరువులు, కుంటలు, వాగులు, పంటకాలువల్లో పూడికతీత పనులు, ఉద్యాన పంటల సాగు తదితర పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. వేసవి దృష్ట్యా వ్యవసాయ పనులు ముగియనున్నాయని, కూలీల సంఖ్య పెరుగుతుందన్నారు. అమృత్ సరోవర్‌లో భాగంగా మండలంలోని మూగచింతలపాలెం, సరికొండపాలెం, అయ్యన్నపాలెం చెరువులను అభివృద్ధి పరుస్తామన్నారు. పలు పంచాయతీలకు ఫీల్డ్ అసిసెంట్ల నియామకం చేపడతామని ఏపీవో తెలిపారు.

విద్యాబోధన మెరుగుపరుచుకోవాలి



తరగతి గదిలో విద్యార్థిని సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ జ్యోతికిరణ్

నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు చిత్తశుద్ధితో పనిచేయాలని మండల విద్యాశాఖ అధికారిణి కె.జ్యోతికిరణ్ తెలిపారు. ప్రకాష్ నగర్‌లోని గిరి మున్సిపల్ పాఠశాలను శనివారం ఆమె ఆకస్మికంగా సందర్శించి రికార్డులు పరిశీలించటంతోపాటు తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాలను పరిక్షించారు.

ఆయా తరగతుల బోధనా ప్రణాళికలు, వర్క్‌బుక్స్, ప్రశ్నాపత్రాల మూల్యాంకనం, సీసీఈ రికార్డులు, మధ్యాహ్న భోజన పథకం వివరాలు పరిశీలించారు. వంటశాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకపోవటం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగయ్య పాల్గొన్నారు.

మాజీ జమిందార్ సతీమణి మృతిపై సంతాపం



శిరీషాదేవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల పాలకవర్గ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: నరసరావుపేట మాజీ జమీందార్ రాజా మల్రాజు విజయకృష్ణ కొండలరావు బహద్దూర్ సతీమణి శిరీషాదేవి మృతి పట్ల శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల యాజమాన్యం సంతాపం వ్యక్తం చేసింది. కళాశాల ఆడిటోరియంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సంతాప సభలో పలువురు మాట్లాడుతూ, శిరీషాదేవి దానధర్మాలను కొనియాడారు. ఈనెల 18వతేదీన మహాశివరాత్రి పర్వదినాన ఆమె శివైక్యం చెందారని, ఆమె ఆత్మకు శాంతి కలగాలని తెలిపారు. ప్రకాష్ నగర్‌లోని కన్నెల హాస్పిటల్‌కు 25ఎకరాలు, రైల్వే స్టేషన్‌లో కొంత భాగం, పుష్పగిరి ఉత్తరాది మఠానికి లింగంగుంట్లలో 1770 ఎకరాలతోపాటు తమ కళాశాలకు మూడు ఎకరాలు, విద్యార్థుల వసతి గృహాల ఏర్పాటుకు ఐదు ఎకరాలను దానంగా ఇచ్చిన దాత అని తెలిపారు. వీటితో పాటు జమీందార్ కుటుంబం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయం, చేజర్ల శ్రీకపోతేశ్వరస్వామి ఆలయాలకు శాశ్వత ధర్మకర్తలుగా ఉండటంతోపాటు ఎన్నో ఆలయాలకు భూరి విరాళాలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్ష,కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్త, ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, లింగంగుట్ల మాజీ సర్పంచ్ పొన్నపాటి ఈశ్వరరెడ్డి, పాలకవర్గ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై కేసు నమోదు చేయాలి

నరసరావుపేట: దళితుడైన గొల్ల ప్రసాద్ భూమిని కబ్జా చేసి తుపాకీతో చంపుతామని బెదిరించి కులం పేరుతో దూషించిన బీజేపీ రాష్ట్ర మీడియా కన్వీనర్ లక్ష్మీపతిరాజు, వల్లభనేని సుధాకర్ చౌదరి, బద్రిరెడ్డి వెంకట రెడ్డిలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో చిలకలూరిపేట రోడ్‌లో గల మాల మహానాడు కార్యాలయంలో దళితసంఘాల ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ మంగళగిరి మండలం పెదకాకాని గ్రామపంచాయతీ పరిధిలోని దళిత సామాజిక వర్గానికి చెందిన గొల్ల ప్రసాద్ అనే వ్యక్తి దగ్గర లక్ష్మీపతిరాజు, సుధాకర్ చౌదరి అరెకరాల భూమిని కబ్జా చేయాలని చూస్తున్నారన్నారు. ఒక సెంటు భూమిలేని సుధాకర్ చౌదరికి వీరు ఆరు ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేస్తారని ప్రశ్నించారు. మాల మహానాడు నాయకులు జంగం బాజీ, ముసుకు రవికుమార్, వివిధ దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు